క్లుప్తంగా

నేడు మోతీనగర్ కమ్యూనిటీ హాల్‌లో ఉచిత వైద్య శిబిరం

మోతీనగర్: మూసాపేట డివిజన్ మోతీనగర్ కమ్యూనిటీ హాలులో ఈ నెల 9న ఆదివారం అమోర్ ఆసుపత్రి, సీనియర్ సిటిజన్స్ ఎంసీహెచ్ఎస్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు అంజిరెడ్డి, రాధాకృష్ణ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ శిబిరం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అందుబాటులో ఉంటుందన్నారు. శిబిరంలో సాధారణ వైద్య పరీక్షలతో పాటు మధుమేహం, బీపీ, ఈసీజీ తదితర పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని మోతీనర్ పరిసర ప్రాంత వాసులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు హెచ్‌పీ రోడ్డులో మైసమ్మ తల్లి బోనాలు ...

మూసాపేట: ఫతేనగర్ డివిజన్ పరిధిలోని హెచ్‌పీ రోడ్డులో ఆదివారం మైసమ్మ తల్లి ఆలయంలో ఆషాఢ మాస బోనాలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తూము జగదీష్ తెలిపారు. తెల్లవారుజాము నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు ఉంటాయని, 10 గంటలకు బోనాల సమర్పణ, సాయంత్రం తొట్టెల ఊరేగింపు నిర్వహిస్తామన్నారు. కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఫతేనగర్ డివిజన్ కార్పొరేటర్ సతీష్ గౌడ్, మూసాపేట మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్ ముఖ్య అతిథులుగా పాల్గొంటారని, భక్తులు, స్థానిక ప్రజలు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

ఆలయ ముఖ ద్వారం ప్రారంభం



ఆలయ ముఖ ద్వారాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తదితరులు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి ప్రశాంత్‌నగర్‌లోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి దేవాలయ ముఖ ద్వారాన్ని శనివారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, స్థానిక కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆలయ ముఖద్వారాన్ని అత్యంత సుందరంగా నిర్మించిన కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణను అభినందించారు.

బీఆర్ఎస్ సీనియర్ నాయకురాలు రవి చంద్రకళ కన్నుమూత



రవి చంద్రకళ పార్థివ దేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి: బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకురాలు రవి చంద్రకళ శుక్రవారం సాయంత్రం అనారోగ్యంతో తుది శ్వాస విడిచారు. కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కేపీహెచ్‌బీ డివిజన్ కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు, కో ఆర్డినేటర్ సతీష్ అరోరా, మాజీ కార్పొరేటర్‌లు శనివారం ఆమె భౌతిక కాయానికి నివాళులర్పించి ఆమె కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

అంబేడ్కర్ భవన నిర్మాణానికి శంకుస్థాపన

ఆల్విన్‌కాలనీ: ప్రగతినగర్‌కాలనీలో నూతనంగా రూ.15 లక్షలతో చేపట్టనున్న అంబేడ్కర్ భవన నిర్మాణానికి శనివారం కూకట్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, డివిజన్ అధ్యక్షుడు సంజీవరెడ్డి, మోజస్, బాబురావు, లింగయ్య, లక్ష్మీనారాయణ, విజయ, రాములు, భాస్కర్, మల్లేష్, నరసింహులు, కృష్ణ, పరశురాములు, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

జోరుగా జంక్షన్ల అభివృద్ధి



కుత్బుల్లాపూర్: జంక్షన్ల అభివృద్ధి పేరిట చేపట్టిన పనుల్లో భాగంగా సుచిత్ర నుంచి కుత్బుల్లాపూర్ అయోధ్యనగర్ చౌరస్తా వరకు సెంట్రల్ లైటింగ్ సిస్టం ఏర్పాటు చేశారు.. ఇందులో భాగంగా ప్రత్యేకంగా డెకరేటివ్ విద్యుత్ లైట్లు అమర్చారు.. శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సిబ్బంది పనులు నిర్వహించారు. వచ్చే నెల మొదటి వారంలో పనులు పూర్తి చేసి అందుబాటులోకి తెస్తామని అధికారులు పేర్కొన్నారు. ఇప్పటికే ఐడిపిఎల్, అయోధ్య నగర్ జంక్షన్ తుది దశకు చేరుకోవడంతో త్వరలోనే ఇక్కడ మరిన్ని మౌలిక వసతులు కల్పించే దిశగా అధికారులు చర్యలు చేపట్టారు.

మహా నేతకు ఘన నివాళి



కేపీహెచ్‌బీ కాలనీలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్. రాజశేఖర్‌రెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించిన కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తదితరులు



రమ్యా గ్రౌండ్స్‌లో జరిగిన వైఎస్సార్ జయంతి వేడుకల్లో పాల్గొన్న 'సాక్షి' డైరెక్టర్ ఈశ్వర ప్రసాద రెడ్డి తదితరులు

కూకట్‌పల్లి: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా జన నేత దివంగత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అందించిన సేవలు చిరస్మరణీయమని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. వైఎస్సార్ 74వ జయంతి సందర్భంగా శనివారం కేపీహెచ్‌బీకాలనీలో కూకట్‌పల్లి వైఎస్సార్ అభిమాన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాన్ని ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావుతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్సార్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు పేద ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయాయన్నారు. ఆరోగ్యశ్రీ, రైతులకు ఉచిత విద్యుత్, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, రైతు రుణమాఫీ తదితర పథకాలతో బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బాబూరావు, వైఎస్సార్ అభిమాన సంఘం నాయకులు బి. శివారెడ్డి, ఎస్. సతీష్ రెడ్డి, బి. మధుసూదన్ రెడ్డి, వి. ఉపేందర్‌రెడ్డి, కేవీ కృష్ణారెడ్డి, వెంకట్‌రెడ్డి, అరవింద్ రెడ్డి, జీఎల్ఎన్ రెడ్డి, జగదీశ్ రెడ్డి, జయచందారెడ్డి, వెంకటరెడ్డి, చెన్నారెడ్డి, కాముని నర్సింహారెడ్డి, జనగాం సురేష్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రమ్యా గ్రౌండ్స్‌లో...

దివంగత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 74వ జయంతి వేడుకలు కేపీహెచ్‌బీకాలనీ రమ్యా గ్రౌండ్స్‌లో ఐటీ వింగ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేసి, భారీ కేక్‌ని కట్ చేశారు. అనంతరం టెంపుల్ బస్ స్టాప్ వరకు ర్యాలీగా తరలి వెళ్లి బస్‌స్టాప్‌లోని వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో 'సాక్షి' డైరెక్టర్ ఈశ్వరప్రసాద్ రెడ్డి, వైఎస్ఆర్‌సీపీ నాయకులు ఎస్వీఎస్ రెడ్డి, ఏలూరు రామచంద్రారెడ్డి, వెంకటరెడ్డి, తులసిరెడ్డి, గాలిరెడ్డి, శేషిరెడ్డి, ఐటీ వింగ్ కోఆర్డినేటర్ రోసిరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

కేపీహెచ్‌బీకాలనీలో...

కేపీహెచ్‌బీకాలనీలో జరిగిన వైఎస్సార్ జయంతి వేడుకల్లో వైయస్ఆర్ అభిమానులు, నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం భారీ కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో టీసీహెచ్ గాలిరెడ్డి, డా. ఏలూరి రాంచంద్రారెడ్డి, తులసిరెడ్డి, శేషసేనా రెడ్డి, సుబ్బారెడ్డి, శేఖర్ రెడ్డి, కోటేశ్వర్ రావు, ఆర్‌వి, శ్రీను, హమిమి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మూసాపేటలో...

మూసాపేట: భరత్‌నగర్ కాలనీ పోచమ్మ గ్రౌండ్‌లో దేవిరెడ్డి మనోహర్‌రెడ్డి, వైఎస్సార్ అభిమానుల ఆధ్వర్యంలో శనివారం వైఎస్సార్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు గోపాల్ రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, శివారెడ్డి, హరినాథ్ రెడ్డి, చంద్రమోహన్, రవి, శ్రీకాంత్‌రెడ్డి, మహేష్, శేఖర్‌రెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, వేణు, వెంకట్, తూము జగదీష్, నాగిరెడ్డి, కృష్ణారెడ్డి, చక్రి, సాంబశివారెడ్డి పాల్గొన్నారు.



కేపీహెచ్‌బీకాలనీలో..



బాలాజీనగర్‌లో..



కేపీహెచ్‌బీ కాలనీలో..



భరత్‌నగర్ కాలనీలో.



మూసాపేటలో..



అల్లాపూర్ డివిజన్ పండిట్ నెహ్రూనగర్‌లో..

మళ్లీ బీఆర్ఎస్ అధికారం చేపట్టడం ఖాయం



పార్టీలో చేరిన వారికి బీఆర్ఎస్ కండువాలు కప్పిన ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలో మూడోసారి అధికారం చేపట్టడం ఖాయమని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. గాజుల రామారం డివిజన్‌కు చెందిన బీజేపీ మైనార్టీ సెల్ జనరల్ సెక్రెటరీ ఎస్.కె.హుస్సేన్, బీజేపీ మహిళా జనరల్ సెక్రటరీ ఎస్.సీతారా, జగద్గిరిగుట్ట డివిజన్ సోమయ్య నగర్‌కు చెందిన కాంగ్రెస్ కార్యకర్తలు డి.మల్లేష్, కే.ఈశ్వరమ్మ ఆధ్వర్యంలో 250 మంది శనివారం చింతల్‌లోని పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే వివేకానంద్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలో తెలంగాణ రాష్ట్రం భారతదేశానికే ఆదర్శంగా నిలుస్తోందన్నారు. మన రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలను ఇతర రాష్ట్రాల ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీలో కష్టపడిన వారికి తప్పక గుర్తింపు ఉంటుందని, ప్రభుత్వ పథకాలను కార్యకర్తలు ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేలా కృషి చేయాలన్నారు.

- ప్రగతి యాత్రలో భాగంగా నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలోని 8వ డివిజన్‌లో పర్యటించిన ఎమ్మెల్యే వివేకానంద్ మేయర్ నీలారెడ్డితో కలిసి రూ.2.92 కోట్లతో చేపడుతున్న పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం రూ.2.18 కోట్లతో ఈశ్వర్ విల్లాస్ నుండి బీ వ ర్లిక్స్ క్లబ్ హౌస్ వరకు, అక్కడి నుంచి అంబీర్ చెరువు వరకు చేపడుతున్న ఎస్ఎన్‌డీపీ నాలా పనులను పరిశీలించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్, కమిషనర్ రామకృష్ణరావు, కార్పొరేటర్ సురేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీబీఏ రిటైల్ మేనేజ్‌మెంట్ కోర్సు ప్రారంభం

కూకట్‌పల్లి: కూకట్‌పల్లిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నూతనంగా బీబీఏ రిటైల్ మేనేజ్‌మెంట్ కోర్సును ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రవేశపెడుతున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎస్. అలివేలు మంగమ్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సు ద్వారా విద్యార్థులకు అపారమైన అవకాశాలుంటాయన్నారు. మల్టీనేషనల్ కంపెనీలు, లాజిస్టిక్ నిర్వహణ రంగంలో, రిటైల్ మార్కెట్ రంగంలో ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. ఉన్నత విద్యను అభ్యసించాలనుకునే వారు ఎంబిఏ, లా తదితర రంగాలను ఎంచుకోవచ్చని తెలిపారు. పరీక్ష ఫీజులు, అడ్మిషన్ ఫీజులు నామ మాత్రంగా ఉంటాయని, అనుభవజ్ఞులు, నిపుణులైన అధ్యాపకులు అందుబాటులో ఉన్నారని, ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు కళాశాలలో వాణిజ్య విభాగం అధ్యాపకులు ఆర్.కరుణ, డా. ఎస్. సురేష్, డా. సాలయ్య, అమరావతి, డా. శ్రీనివాసరావులను సంప్రదించాలని సూచించారు.

కాంగ్రెస్ ప్రభుత్వ ఏర్పాటుతోనే కుటుంబ పాలన అంతం



కాకతీయనగర్‌లో ప్రచారం చేస్తున్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి భూపతిరెడ్డి

కుత్బుల్లాపూర్: తెలంగాణ రాష్ట్రంలో కుటుంబ పాలన అంతం కావాలంటే కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి అన్నారు. శనివారం ఆయన కుత్బుల్లాపూర్ డివిజన్ పరిధిలోని వెంకటేశ్వరనగర్, వాణీనగర్, ఇందిరనగర్, కాకతీయనగర్, చింతల్ మార్కెట్ రోడ్డు ప్రాంతాల్లో పాదయాత్ర నిర్వహించి స్థానికంగా నెలకొన్న సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్ర సాధనకు ఎంతో మంది విద్యార్థులు, నిరుద్యోగులు ప్రాణ త్యాగం చేశారని, అయితే ప్రస్తుతం వారి ఆశయాలను అనుగుణంగా పాలన కొనసాగడం లేదన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు లేక అల్లాడుతున్నారని, నిరుద్యోగ భృతి ఇవ్వకుండా బీఆర్ఎస్ ప్రభుత్వం మోసం చేసిందన్నారు. రాష్ట్రంలో మార్పు కోసం యువత ఎదురు చూస్తోందని, అది కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమన్నారు. తమ పార్టీ అధికారంలోకి రాగానే 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేస్తామని, నిరుద్యోగులకు నెలకు రూ.4వేల భృతి కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో తుల్లాపూర్-ఏ బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బండి శ్రీనివాస్ గౌడ్, బౌరంపేట్ మాజీ సర్పంచ్ మిద్దెల యాదిరెడ్డి, డివిజన్ ఇంచార్జ్ ఇరుగు రాధకృష్ణ, నాయకులు శివరాజ్ పాటిల్, నవీన్, రహీమ్, భరత్ గౌడ్, సమీర్ ఖాన్, భీమ్ రావు, అరుణ, చింతకింది సురేష్, ఖాజా భాయ్, జలీల్ ఖాన్, పరశురామ్ గౌడ్,మిద్దెల సీతారామ్‌రెడ్డి, మాదిరెడ్డి అరుణ్ రెడ్డి తదితరులు ఉన్నారు.

రెగ్యులరైజ్ చేయించుకోని నిర్మాణాల కూల్చివేత



సుభాష్‌నగర్: ప్రభుత్వ స్థలాల క్రమబద్ధీకరణకు 59 జీఓ కింద డిమాండ్ నోటీసులు అందుకున్న దరఖాస్తుదారులు, రెగ్యులరైజ్ చేయించుకోకపోవడంతో శనివారం కుత్బుల్లాపూర్ తహసీల్దార్ సంజీవరావు తదుపరి చర్యలు చేపట్టారు. 2022లో 59 జీఓ కింద 14518 మంది దరఖాస్తులు చేసుకోగా, అందులో అర్హులుగా గుర్తిస్తూ 4032 మందికి డిమాండ్ నోటీసులు జారీ చేశారు. వారిలో కేవలం 900 మంది మాత్రమే రెగ్యులరైజ్ చేయించుకోలేదు. చేసుకోగా మిగిలినవారు రిజిస్ట్రేషన్ చేయించుకోలేదు. దీంతో మిగిలినవారికి తహసీల్దార్ నాలుగు రోజుల క్రితం మూడు రోజుల పాటు అవకాశం ఇచ్చారు. లేని పక్షంలో నిర్మాణాలు కూల్చివేస్తామని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో శనివారం జగద్గిరిగుట్ట, గాజులరామారం డివిజన్లలోని పలు బస్తీల్లో ఇళ్లను కూల్చివేసేందుకు వెళ్లగా 59 లబ్ధిదారులు కూల్చవద్దని వేడుకున్నారు. మరో వారం రోజులపాటు అవకాశం ఇవ్వాలని కోరగా అధికారులు వెనుతిరిగారు.

కేసీఆర్ నేతృత్వంలోనే రాష్ట్ర అభివృద్ధి



ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుకు సమస్యలను వివరిస్తున్న ప్రజలు

కుత్బుల్లాపూర్: ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని, కుట్రలు కుతంత్రాలతో కాంగ్రెస్, బీజేపీ బీఆర్ఎస్‌పై విష ప్రచారం చేస్తున్నాయని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజక వర్గానికి చెందిన పలువురు శనివారం ఎమ్మెల్సీని కలిసి తమ సమస్యలను విన్నవించారు. దీనిపై స్పందించిన ఆయన సంబంధిత అధికారులతో ఫోన్లో మాట్లాడి సమస్య పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు. కొంపల్లి మున్సిపాలిటీలో పలు సమస్యలు ఎమ్మెల్సీ రాజు దృష్టికి తీసుకెళ్లినట్లు కౌన్సిలర్ డప్పు కిరణ్ తెలిపారు.

ఘనంగా మాన్‌సూన్ వేడుకలు



మాన్‌సూన్ వేడుకల్లో పాల్గొన్న చిన్నారులు, చిన్నారుల తల్లిదండ్రులు

మూసాపేట: మూసాపేట శ్రీహరినగర్‌లోని కిడ్జీ స్కూల్‌లో శనివారం మాన్‌సూన్ (రుతుపవనాలు) ఫెస్టివల్ నిర్వహించారు. విద్యార్థుల తల్లిదండ్రులకు పాఠశాల ఆవరణలో డ్రాయింగ్, గొడుగులపై మాన్‌సూన్ చిత్రాల పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన చిన్నారుల తల్లిదండ్రులకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా స్కూల్ కరస్పాడెంట్ చిన్నారావు మాట్లాడుతూ మనకు అన్నం పెట్టే రైతన్నకు రుతుపవనాలు ఎంతో ముఖ్యమని, వాటిపై ఈ తరం చిన్నారులు తెలుసుకోవాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. రైతులపై చిన్నారులకు చిన్నప్పటినుంచే అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ అర్చన, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

ధరణినగర్‌లో సమస్యల పరిష్కారానికి కృషి



ధరణినగర్‌లో సమస్యలను తెలుసుకుంటున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని ధరణినగర్‌లో డ్రైనేజీ, రోడ్లు లేక సమస్యలు ఎదుర్కొంటున్నామని ఆయా ప్రాంతాల ప్రజలు కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన శనివారం ధరణినగర్‌లో పర్యటించి సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హైటెన్షన్ లైన్ రోడ్డులోని డ్రైనేజీ, వాటర్ లైన్ సమస్యలు, సీసీ రోడ్డు పనులు పెండింగ్‌లో ఉన్నాయని, సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరలో పనులు చేపట్టే విధంగా కృషి చేస్తానని కాలనీ వాసులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సమ్మారెడ్డి, కాలనీ అధ్యక్షుడు రాజబాబు, భాస్కర్ రెడ్డి, పోశెట్టి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనుల్లో నాణ్యత పాటించాలి



నందమూరినగర్‌లో సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు తదితరులు

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ నందమూరినగర్‌లో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను స్థానిక కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు శనివారం జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదర్‌నగర్ డివిజన్‌లో అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. సీసీ రోడ్డు పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. ప్రజలకు ట్రాఫిక్‌రహిత, సుఖవంతమైన, మెరుగైన రవాణా సౌకర్యం కోసం శాయశక్తులా కృషి చేస్తానన్నారు. పనుల్లో జాప్యం లేకుండా త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటానని, ఎవరికి ఎలాంటి సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ మహదేవ్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



మందులను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు తదితరులు

భాగ్యనగర్‌కాలనీ: ఉచిత వైద్య శిబిరాలను పేదలు సద్వినియోగం చేసుకోవాలని కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు అన్నారు. శనివారం హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని రాంనరేశ్ నగర్ కమ్యూనిటీ హాల్‌లో కల్వరి టెంపుల్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని కల్వరి టెంపుల్ హాస్పిటల్ ఎండీ రాజేష్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ పరిసర ప్రాంత ప్రజలకు కార్పొరేట్ స్థాయిలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయటం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా జనరల్ మెడిసన్‌కు సంబంధించిన వైద్యులు, స్త్రీలు, చిన్న పిల్లల వైద్యులతో పాటు ఎముకలు, చర్మ వ్యాధులకు సంబంధించిన వైద్యులు, నేత్ర వైద్యులు పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఉచితంగా మందులు, కళ్లజోళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డివిజన్ ఉపాధ్యక్షుడు పోతుల రాజేందర్, కుమార్‌స్వామి, నాయకులు సింథం శ్రీకాంత్, వెంకటేష్ యాదవ్, రాఘవేందర్‌రెడ్డి, నర్సింగరావు, రాము, రషీద్, రాజిరెడ్డి, మహేందర్‌రెడ్డి, వెంకట్రావు, వైద్యులు చంద్రిక, సమీర్, విజయచ, వినోద్, పీఆర్ఓ జైరామ్, అడ్మిన్ శ్రీధర్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వేతన సవరణ చేపట్టాలి

చింతల్: రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగులకు వేతన సవరణ చేయాలని టీఎస్‌పీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య అన్నారు. శనివారం జయసింహారెడ్డి మేడ్చల్ జిల్లా టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కమిటీ సమావేశం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జంగయ్య మాట్లాడుతూ వేతన సవరణ చేపట్టాలని తాము ఇచ్చిన గడువు జూన్ 29తో ముగిసిందన్నారు., వెంటనే వేతన సవరణ కమిటీ నియామకం చేపట్టాలని డిమాండ్ చేశారు. దీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న బదిలీలు, ప్రమోషన్ల షెడ్యూల్‌ను వెంటనే విడుదల చేయాలని కోరారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల ఇనకంటాక్స్ పరిమితిని రూ. 8 లక్షలకు పెంచాలని, పేద విద్యార్థులకు దూరం చేసే, ఉద్యోగులకు శాపంగా మారిన ఎన్‌పీఎస్ పథకాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మాణిక్ రెడ్డి మాట్లాడుతూ మౌలిక సదుపాయాల కల్పన, పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ కుమార్, జిల్లా ఆఫీస్ బేరర్లు వందన, రాకేష్, ప్రసన్న, ఉపేందర్, రవి, శ్రీనివాస్, మదన్ రెడ్డి, కుమారస్వామి, నీరజ, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టీఎస్‌పీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య

ప్రజాస్వామ్య పరిరక్షణకు కృషి చేయాలి



కుత్బుల్లాపూర్: ప్రజాస్వామ్య విలువల విషయంలో భారతదేశం ప్రపంచానికే ఆదర్శంగా నిలుస్తుందని, అలాంటి ప్రజాస్వామ్యాన్ని కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ట్రెస్మా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల మల్లేశంయాదవ్ అన్నారు. భారతదేశ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికల నిర్వహణ, విధానాలపై అవగాహన కల్పించేందుకు శనివారం నేతాజీ పాఠశాలలో కెప్టెన్, వైస్ కెప్టెన్ ఎన్నికలను బ్యాలెట్ పద్ధతిలో నిర్వహించారు. 2023–24 సంవత్సరానికి గాను పాఠశాల కెప్టెన్‌గా సంకీర్తన, వైస్ కెప్టెన్‌గా గ్రీష్మ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ముఖ్య అతిథిగా హాజరైన ప్రముఖ సైకాలజిస్ట్ మోటివేషనల్ స్పీకర్ శ్రీనివాస్‌రావు విద్యావిధానంపై సూచనలు చేశారు. సెల్‌ఫోన్‌లు, టీవీలకు దూరంగా ఉండి గురువులు చెప్పినట్లు నడుచుకోవాలన్నారు. కార్యక్రమంలో నేతాజీ స్కూల్ కరస్పాండెంట్ మహేష్ కుమార్, అకాడమిక్ డైరెక్టర్ నందిని, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 2023లో ఎస్ఎస్‌సీ ఫలితాల్లో మంచి గ్రేడ్‌లు సాధించిన విద్యార్థులను సత్కరించారు.